క్లుప్తంగా

ముళ్లపొదల తొలగింపు



రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగిస్తున్న జేసీబీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల పంచాయతీలోని పలు గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను సోమవారం సర్పంచ్ జొన్నల రమణమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లజశ్రీ తొలగించారు. కేటీ రోడ్డు నుంచి పల్లమాలకండ్రిగ, సుద్దమిట్ట, పాపానాయుడుగుంట గిరిజన కాలనీ, దళితవాడ వరకు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు ఎక్కువగా పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన సర్పంచ్ జేసీబీతో చెట్లను తొలగించారు. అదే విధంగా చెత్త సంపద కేంద్రం వద్ద పారిశుద్ధ్య పనులు చేయించారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో దేవాంగ సంఘం నేతలు



ఆలయం వద్ద దేవాంగ సంఘం నాయకులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం గుంటూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమన దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కాలేపు సత్యనారాయణ, సభ్యులు దర్శించుకున్నారు. వారికి దక్షిణ భారత దేవాంగ సంఘం సమాఖ్య ఉపాధ్యక్షులు మన్నెముద్దు శ్రీనివాసులు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వారిని ఆశీర్వించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకు



నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంకు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం పంచాయతీ వితయ్యపాళెంలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. దీన్ని నాలుగేళ్ల క్రితం రూ.17 లక్షలతో నిర్మించారు. దీని సామర్థ్యం 20 వేల లీటర్లు. స్థానిక పాలకులు ట్యాంకును వినియోగంలోకి తీసుకురాలేదు. ట్యాంకు నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్లు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం వితయ్యపాళెంలో తాగునీటి సమస్య తీవ్రంగా వుంది. ప్రజలు నీటి కోసం వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ట్యాంకును వినియోగంలోకి తీసుకువచ్చి నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

సమ్మెలో వైద్యులు.. ఇబ్బందుల్లో రోగులు

- దుమ్మాకొడుతున్న తాత్కాలిక వైద్యులు
- పట్టించుకోని అధికారులు

రేణిగుంట: ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ వైద్యులు సమ్మెబాట పట్టారు. దీంతో వారం రోజులుగా రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. డాక్టర్లు సమ్మెలో ఉండడంతో ఓపీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. రేణిగుంటలో సోమవారం స్థానిక పీహెచ్‌సీకి వచ్చిన రోగులు నానా అవస్థలు పడ్డారు. సరాసరిగా రోజుకి 150 మంది వరకు వైద్యం చేసుకునేందుకు పీహెచ్‌సీకి వస్తుంటారు. సోమవారం స్టాఫ్ నర్స్ మాత్రం వైద్యం చేసి పంపించారు. తిరుపతి రుయా హాస్పిటల్ నుంచి పీజీ డాక్టర్ని తాత్కాలికంగా ఓపీలు చూసేందుకు పంపించారు. వారు సైతం రాకపోవడంతో వైద్యం అందక రోగులు ఇబ్బందిపడ్డారు. స్టాఫ్ నర్సులు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఒకరు ట్రైనింగ్‌లో ఉండగా, మరో పోస్ట్ ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఒక స్టాఫ్ నర్స్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. వైద్యులు సమ్మెలో ఉండడంతో 104 వాహనాలు వైద్యశాలకే పరిమితమయ్యాయి. గ్రామాల్లో పేద ప్రజలు 104 వైద్య సేవల కోసం నిరీక్షిస్తున్నారు. స్థానిక బిస్మిల్లా నగర్ కు చెందిన గర్భవతికి రక్తస్రావం అవడంతో కుటుంబీకులు సోమవారం ఉదయం పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. డాక్టర్లు లేకపోవడంతో ఆమెను 108 వాహనం ద్వారా తిరుపతి మెటర్నటీ హాస్పిటల్‌కు తరలించారు.



రేణిగుంట పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ



వైద్యం కోసం వేచి ఉన్న రోగులు



వైద్యం అందిస్తున్న స్టాఫ్ నర్స్




పీహెచ్‌సీకి పరిమితమైన 104 వాహనాలు

ఎనిమిదో రోజూ అందని వైద్యం



రోగికి వైద్యం చేస్తున్న నర్సు

బుచ్చినాయుడుకండ్రిగ: పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు సమ్మెలో వుండడంతో ఎనిమిది రోజులుగా పేదలకు వైద్యం అందడం లేదు. పీజీ డాక్టర్ విధులకు హాజరు కాలేదు. ఆస్పత్రి ఎదుట 'ఓపీ సేవలు నిలిపివేయబడ్డాయి' అని బోర్డు తగిలించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పేదలు పీహెచ్‌సీకి వస్తున్నారు. వారికి నర్సులు తమకు తెలిసిన మందులు ఇచ్చి పంపిస్తున్నారు. వైద్యుల సమ్మెను అదునుగా చేసుకుని ఆర్‌ఎంపీలు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వైద్యులు విధులకు హాజరయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఓపీ సేవలు నిలిపివేసినట్లు బోర్డు

ముక్కంటి సేవలో మాజీ మంత్రి



దర్శనానికి వెళుతున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు వస్తువులు అందజేస్తున్న దాతలు

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలుకు చెందిన స్కూల్ మేళా హెల్ప్ రూరల్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సోమవారం మండలంలోని తొట్టంబేడు, పిల్లమేడు, పెద్దకనపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సామగ్రి అందజేశారు. సభ్యులు మాట్లాడుతూ తాము ప్రతి సంవత్సరం విద్యార్థులకు బ్యాగులు, దుస్తులు, గొడుగు, జామెంట్రీ బాక్సు, వాటర్ బాటిల్ తదితర వస్తువులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు శివానందం, స్కూల్ మేళా కో–ఆర్డినేటర్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు: వరదయ్యపాళెం మండలం కంచరపాళెంకు చెందిన ప్రవీణ్‌పై దాడి చేసిన కేసులో సత్యవేడు దళితవాడకు చెందిన రవి(25), పవన్(25)ను అరెస్టు చేసినట్టు సీఐ మురళీనాయుడు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరులో నెల క్రితం కొందరు యువకుల మధ్య వివాదం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో వరదయ్యపాళెం మండలం కంచరపాళెంకు చెందిన ప్రవీణ్ సొంత పని నిమిత్తం సత్యవేడు వచ్చాడని తెలిపారు. అతన్ని చూసిన దళితవాడకు చెందిన రవి, పవన్, పృథ్వీ దాడికి చేసి తీవ్రంగా గాయపరిచారని వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితులు రవి, పవన్ ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండు వద్ద ఉండగా అరెస్టు చేశామన్నారు. వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండుకు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. కార్యక్రమంలో సత్యవేడు ఎస్‌ఐ రామస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

పన్నులు వంద శాతం వసూలు చేయాలి

సత్యవేడు: పంచాయతీల పరిధిలో ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని ఏఈ త్రివిక్రమారావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీల ఆర్థిక వనరులు పెంపుపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో భవనాల నిర్మాణానికి అనుమతులు, దుకాణాలకు లైసెన్సులు ఇవ్వడం, ఆస్తుల లీజు, ఇంటి పన్నుల పెంపు, సంత వేలం తదితరాలను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. తద్వారా పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని పేర్కొన్నారు.

మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ముక్కంటీశునికి విరాళాలు





విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వీఎస్‌కే రాజు కుటుంబ సభ్యులు రూ.70 వేలు, గోశాలలోని గోసంరక్షణకు గుంటూరుకు చెందిన చవ్వాకుల దినకర్ దంపతులు రూ.40వేలు సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

చీఫ్ వర్క్ షాప్ మేనేజర్‌గా శ్రీనివాస్



సీడబ్ల్యూఎంను సత్కరిస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యవర్గ సభ్యులు

రేణిగుంట: తిరుపతి–రేణిగుంట మార్గంలోని సీఆర్‌ఎస్‌కు కొత్త చీఫ్ వర్క్ షాప్ మేనేజర్‌గా ఎస్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న దేవ సహాయం బెంగళూరుకు బదిలీపై వెళ్లారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యవర్గ సభ్యులు, రైల్వే సంఘ్ యూనియన్ సభ్యులు చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి, సతీమణి శ్రీమతి బియ్యపు శ్రీవాణి రెడ్డి తమ 30వ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వారు శ్రీ అర్ధనారీశ్వర స్వామి వారి అభిషేక సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు, పేదలకు దంపతులు తమ చేతుల మీదుగా అన్నదానం చేశారు. పార్టీ శ్రేణులు బియ్యపు దంపతులతో కేక్ కటింగ్ చేయించి, వారికి పూల దండలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.



అర్ధనారీశ్వరాలయం వద్ద అన్నదానం చేస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు

గ్రీవెన్స్‌డేకు అధికారుల గైర్హాజరు





మూతవేసిన తహసీల్దారు గది, ఆ గది వద్ద వేచి ఉన్న ప్రజలు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమమవారం తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమానికి అధికారులు హాజరుకాలేదు. వివిధ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు చాలా సేపు పడిగాపులు పడ్డారు. ఎంతకూ అధికారులు రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. మండల స్థాయి అధికారులే గ్రీవెన్స్‌డేకు దుమ్మా కొడుతుండడంతో కింద స్థాయి ఉద్యోగులు సైతం రావడం లేదని, తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రీవెన్స్ డేకు మండల, గ్రామ స్థాయి అధికారులు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న ఎంపీడీవో కుర్చీ


సైద్ధాంతిక చైతన్యంతో ప్రజా ఉద్యమాలు



మాట్లాడుతున్న హరినాథరెడ్డి

వరదయ్యపాళెం: రాజకీయ చైతన్యంతో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి తెలిపారు. వరదయ్యపాళెంలో సోమవారం సీపీఐ తిరుపతి జిల్లా సమితి సభ్యులకు ఐదు రోజుల పాటు రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనం కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. భూర్జువా పార్టీలు ఓట్ల కోసం, అధికారం కోసం ప్రజల ముందుకు వస్తున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి మాత్రమే ముందుకు వచ్చే ఏకైక పార్టీ సీపీఐ అని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలక పాత్రను పోషించిందని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏనాడూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని పేర్కొన్నారు. కార్యకర్తలు ఎప్పటికప్పుడు రాజకీయ చైతన్యంతో కూడిన పోరాటాలకు సిద్ధపడాలని సూచించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నిరాజ్ తదితరులు తెలిపారు.

ఎంఈవో-1గా కోదండ నాయుడు



ఎంఈవోను అభినందిస్తున్న పీఆర్టీయూ నేతలు

నారాయణవనం: ఎంఈవో–1గా కోదండనాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈవో–1 ప్రభాకర్‌రాజు మూడు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. నాగలాపురం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కస్తూరయ్య ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ క్రమంలో రెగ్యులర్ ఎంఈవో–1గా కోదండనాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సహకారంతో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఎంఈవో–1 కోదండనాయుడిని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివన్, మండల అధ్యక్షుడు జానకిరామన్ అభినందించారు.



రేణిగుంట బస్టాండ్



బస్టాండ్‌లో ఆగిఉన్న ప్రైవేట్ బస్సు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

బస్టాండ్‌లో కనిపించని వసతులు

- మరుగుదొడ్లు లేక ప్రయాణికులకు ఇబ్బందులు
- చీకటి పడితే మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- ఆర్టీసీ బస్సుల కన్నా ప్రైవేట్ వాహనాలదే హవా





ఆర్టీసీ బస్టాండ్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలు

రేణిగుంట: ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న రేణిగుంట బస్టాండ్‌లో వసతులు కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి తగిన సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు వున్నా ఎప్పుడూ తాళాలు వేస్తున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. కొంతమంది పక్కనే ఉన్న రైల్వే స్టేషన్ వద్దకు వెళుతున్నారు. పురుషులు బస్టాండ్ లోనే బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో వుండలేకపోతున్నారు. ఇక్కడున్న దుకాణాల ద్వారా నెలకు సుమారు రూ.3 లక్షలకు పైగా ఆదాయం వస్తున్నా మౌలిక వసతుల కల్పన గురించి అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు

బస్టాండ్‌లో రాత్రిళ్లు ఆర్టీసీ సిబ్బంది లేకపోవడంతో కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మందు బాబులు బస్టాండ్ ఆవరణలోనే మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో బస్సుల కోసం వేచి వుండే వారిపై దాడులకు దిగుతున్నారు.

ప్రయివేట్ వాహనాలే ఎక్కువ

ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ వాహనాలు ఎక్కువగా బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రైవేట్ బస్సులు బస్టాండ్‌లోకి రాకూడదు. తమిళనాడుకు చెందిన భారతి బస్సులు బస్టాండ్‌లోనే ఆగుతున్నాయి. సిబ్బంది ప్రయాణికులను ఎక్కించుకుంటున్నా పట్టించుకునే వారు లేరు.

మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి



దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి శనివారం వారపు సంత కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎక్కువ మంది ప్రజలు బస్సుల్లో వస్తుంటారు. బస్టాండ్‌లో కనీసం తాగునీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు వున్నా మూసేసి వున్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలి.
–ఈశ్వరమ్మ, సీపీఎం రేణిగుంట టౌన్ కార్యదర్శి

బస్టాండును గాలికి వదిలేయడం దారుణం



నెలకు రూ.3 లక్షలకు పైగా ఆదాయం ఇచ్చే బస్టాండ్ అభివృద్ధి గురించి ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. రాత్రిళ్లు ఆర్టీసీ సిబ్బంది లేకపోవడంతో మందు బాబులు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ లో పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించడంతో పాటు సదుపాయాలు కల్పించాలి. –సత్యశ్రీ, సీపీఎం కరకంబాడి ఏరియా కార్యదర్శి, రేణిగుంట

చేతివృత్తులతో ఆర్థిక స్వావలంబన



టైలరింగ్ మెటీరియల్ అందుకుంటున్న మహిళలు

నారాయణవనం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి చేతి వృత్తులు దోహదపడతాయని జన శిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ మోహన్ తెలిపారు. నారాయణవనంలో సోమవారం రాస్, జన శిక్షణ్ సంస్థాన్ సంయుక్తంగా మహిళలకు ఉచిత టైలరింగ్ రెండో విడత శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు టైలరింగ్‌లో రోజుకు 3 గంటల చొప్పున 60 రోజులు శిక్షణ ఇస్తామని తెలిపారు. మహిళలు శిక్షణ పొంది ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు టైలరింగ్ మెటీరియల్ అందజేశారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు హరి, రవి, లోకనాథం, ట్రైనర్లు మాలిని, లలిత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాళహస్తి - సత్యవేడు :
90100 03139